## సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

భైంసా, ఏప్రిల్ 23 : సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సాయాన్ని అందిస్తూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముథోల్, లోకేశ్వరం, కుభీర్, భైంసా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐలు గోపీనాథ్, మల్లేశ్, ఎస్ఐలు శంకర్, అశోక్, రవీందర్, గౌస్, భరోసా సెంటర్ సిబ్బంది జ్యోతి, శిరీష, క్యాంపు ఇన్‌చార్జి రఘువీర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

కుభీర్, ఏప్రిల్ 23 : నిర్మల్‌లోని కురాన్నపేటకు చెందిన నిగులపు శంకర్, నిగులపు రాజు అనే డప్పు కళాకారులు స్థానిక పోచమ్మ ఆలయంలో పండుగ నిమిత్తం ఆదివారం ఎండలో డప్పులు కొడుతూ వడదెబ్బతో మృతి చెందారు. డప్పు కళనే వృత్తిగా నమ్ముకుని జీవిస్తున్న వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు, మాదిగ సంఘం నాయకుడు గోరేకర్ కాశీనాథ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

## నాణ్యమైన ధాన్యాన్ని తీసుకెళ్లాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 23 : కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకెళ్లాలని రైతులకు ఏఈవో కిరణ్ సూచించారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం మల్లాపూర్ గ్రామంలో బుధవారం వరి కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు భూమేశ్, చిరంజీవి, బుచ్చన్న, రమేశ్, సత్తన్న పాల్గొన్నారు.

## దవాఖానల్లో కనీస సౌకర్యాలు లేవు

బేల, ఏప్రిల్ 23 : బీసీ, ఎస్సీ, ఎస్టీలైనా అణగారిన పేద వర్గాలకు కనీసం దవాఖానల్లో సౌకర్యాలు లేవని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బేలలోని ప్రభుత్వ దవాఖాన సందర్శించారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. దవాఖాన నిర్వహణ అధ్వానంగా ఉండడంతో తనే స్వయంగా బూజు దులిపి చీపురులతో ఊడిచారు. డాక్టర్‌తో మాట్లాడి రెండు రోజుల్లో దవాఖానను శుభ్ర పరచాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే

బోథ్, ఏప్రిల్ 23 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని లంబడితండా, కరత్‌వాడ గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. బోథ్ ఎంపీడీవో రమేశ్ ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా ప్రాథమికంగా ఎంపికైన అర్హుల ఇంటి స్థితిని వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరత్వాడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

ఎదులాపురం, ఏప్రిల్ 23 : వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుతున్న దృష్ట్యా భవన నిర్మాణ కార్మికులు తగు జాగ్రత్తలు పాటించాలని సహాయ కార్మిక అధికారి రాజలింగు సూచించారు. ఆదిలాబాద్‌లోని నేతాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి, కార్మిక శాఖ సౌజన్యంతో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పోశన్న, పెంటాజీ, కార్మికులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 23 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్మే వెడ్మ బొజ్జు పటేల్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, పీఏసీఎస్ అధికారులు సుజాత, ధరంసింగ్ కలెక్టర్ రాజర్షి షాను వేర్వేరుగా శాలువాలతో సన్మానించారు. మండలంలో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

## జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఎదులాపురం, ఏప్రిల్ 23 : యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రిన్సిపాల్ డాక్టర్ జే సంగీత అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై చర్చ గోష్టి, లఘు చిత్రం, కవితా పఠనం, క్విజ్, వీధి నాటకాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్ సమన్వయకర్త డాక్టర్ రమేశ్, అధ్యాపకులు, పోలీస్ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కడెం, ఏప్రిల్ 23 : నిర్మల్ జిల్లా కడెం మండలం దోస్తనగర్ సమీపంలోని కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ లోగో వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌కు చెందిన దాముక శివకృష్ణ అనే వ్యక్తి కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి కడెం మండలం నచ్చన్ఎల్లాపూర్ గురుకుల పాఠశాలకు వెళ్తుండగా కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు నుజ్జునుజ్జు కాగా ఇద్దరికి గాయాలయ్యాయి. శివకృష్ణకు గాయాలు కాగా జన్నారం దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

# వరంగల్ సభకు తరలిరావాలి

- పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

జైనథ్, ఏప్రిల్ 23 : ఈ నెల 27న నిర్వహించే చలో వరంగల్ సభకు జైనథ్ మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని మాజీ ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కాప్రి గ్రామంలో చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేశ్ యాదవ్, రాంరెడ్డి, రామన్న, వెంకట్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



జైనథ్: కాప్రిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### సభను విజయవంతం చేయాలి

ఉట్నూర్, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో చలో వరంగల్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, అడగకున్నా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పకడ్బందీగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కింద న్నారు. ఆయన పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ రావాలని కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలన చూశాక ప్రజలు విసిగిపోయారని అన్నారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు దండుకట్టి తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు ముజీబ్, నాయకులు కాటం రమేశ్, మహేందర్, సత్యం, మల్లారెడ్డి, ప్రసాద్, సాజీద్, పాండ్‌రంగ్, సోనేరావ్, బొజ్జు, వసంత్‌రావ్ పాల్గొన్నారు.



ఉట్నూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## ఆలయాల నిర్మాణాల ఘనత కేసీఆర్‌దే



ఆలయాభివృద్ధికి విరాళం అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 23 : ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వ నిధులు ఖర్చు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టీ) గ్రామంలో నిర్మించిన రేణుక మాత ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను బుధవారం నిర్వహించారు. ఆలయాభివృద్ధికి రామన్న రూ.5 లక్షల సహాయం అందించడంపై గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామన్న మాట్లాడుతూ.. రేణుక మాత కృపతో గ్రామస్తులంతా సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంద్రత్ రమేశ్, పండ్ల శ్రీనివాస్, కొండ గణేశ్ దమ్మపాల్, బట్టు సతీశ్, కుమ్ర రాజు, మహేశ్ పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా శ్రీవాణి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 23: నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎస్ శ్రీవాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ జిల్లా జడ్జిగా పని చేసిన కర్ణకుమార్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. సిటీ కోర్టులో విధులు నిర్వహిస్తున్న శ్రీవాణి బదిలీపై నిర్మల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, కోర్టు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న జడ్జి

బాసర, ఏప్రిల్ 23 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారిని బుధవారం జిల్లా నూతన జడ్జి శ్రీవాణి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెను భైంసా ఏఎస్పీ అవినాశ్, ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్ఐ గణేశ్, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆమెకు అమ్మవారి చిత్రపటం అందజేసి ఆశీర్వదించారు.

## హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

ఎదులాపురం, ఏప్రిల్ 23: ఆరోగ్యం కాపాడుతూ హజ్ యాత్రను యాత్రీకులు విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం టీఎన్జీవోస్ హోంలో ఆదిలాబాద్ హజ్ సొసైటీ, శాంతినగర్, పుత్లిబౌలి, ఖుర్షిద్‌నగర్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై యాత్రికులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. అనంతరం వ్యాక్సినేషన్ వేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్, హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, మహ్మద్ ఆసీఫ్, వైద్యులు సయిద్ అన్సారీ, ఇర్ఫాత్, సాయినాథ్ శాంతినగర్, పుత్లిబౌలి, ఖుర్షిద్‌నగర్ పీహెచ్‌సీల సీసీలు ప్రశాంత్ దేశ్‌పాండే, రాజారెడ్డి, నవీన్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారం

ఉట్నూర్/ఇంద్రవెల్లి, ఏప్రిల్ 23: భూ భారతి ద్వారా సాదా బైనామా సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ రాజర్షిషా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో, ఇంద్రవెల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త ఆర్ఓఆర్ చట్టం రైతులకు భూ భారతి చట్టంలోని పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో ప్రసాద్, డీఆర్డీవో రవీందర్, ఇంద్రవెల్లి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఏవో గణేశ్ ఎఫ్ఆర్వో సంతోష్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్‌డోంగ్రే, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తానూర్/భైంసాటౌన్, ఏప్రిల్ 23 : భూభారతి చట్టం అమలుతో ప్రజల భూ సమస్యలు దూరమవుతాయని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ జిల్లా తానూర్‌లోని రైతు వేదికలో, భైంసా మండలంలోని వానల్‌పాడ్ రైతు వేదికలో భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఖానాపూర్: కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న హిందూ ఉత్సవ సమితి, బజరంగ్‌దళ్ నాయకులు



ముథోల్: కొవ్వొత్తుల ర్యాలీలో హిందూ వాహిని నాయకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఖానాపూర్, ఏప్రిల్ 23 : జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో బుధవారం రాత్రి బజరంగ్‌దళ్, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ఉగ్రవాదులను అణిచి వేయాలని నినాదాలు చేశారు. పర్యటనలో భాగంగా హిందువులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధకరమన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్, హిందూ ఉత్సవ సమితి నాయకులు ప్రణయ్, సురేశ్, వెంకటేశ్వర్లు, సురేశ్ పాల్గొన్నారు.

ముథోల్, ఏప్రిల్ 23 : పహల్గాంలో హిందువులపై ఉగ్రదాడికి నిరసనగా ముథోల్‌లో హిందూ వాహిని, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఉగ్రవాదులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

కుంటాల, ఏప్రిల్, 23 : కుంటాలలో గ్రామస్తులు ఉగ్రదాడిలో మరణించిన వారికి సంఘీభావం తెలపడానికి కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. అనంతరం మృతుల మనశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు.

నర్సాపూర్ (జీ), ఏప్రిల్, 23 : ఉగ్రదాడిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మశాంతి చేకూరాలని నర్సాపూర్‌లో బుధవారం గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. బోయవాడ హనుమాన్ మందిర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

బోథ్, ఏప్రిల్ 23: పహల్గాంలో ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని బుధవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా బోథ్, కౌట గ్రామాల్లో గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ఉట్నూర్, ఏప్రిల్ 23: జమ్మూకశ్మీర్‌లో అమరులైన యాత్రికులకు శాంతి చేకూరాలని ఉట్నూర్‌లో బీజేపీ నాయకులు, అడ్వకేట్ జగన్, కొండేరి రమేశ్ కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



బోథ్‌లో...



నర్సాపూర్ (జీ)లో..

## బీసీ కులాల ఐక్య వేదిక కార్యవర్గం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 23 : నిర్మల్ జిల్లా బీసీ కులాల ఐక్యవేదిక కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎంసీ లింగన్న, ప్రధాన కార్యదర్శిగా అమరవేణి నర్సాగౌడ్, సహాధ్యక్షుడిగా అనుముల భాస్కర్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా డా.ఈసవేణి మనోజ్‌యాదవ్, కోశాధికారిగా భూసారపు గంగాధర్, అదనపు కార్యదర్శిగా యాటకారి సాయన్న, ఉపాధ్యక్షులుగా నిమ్మ గణేశ్, సముద్రాల వెంకటి, కొండాపురం ప్రభాకర్, పిండి శ్రీనివాస్, ఎం రాజేశ్వర్ ఎన్నికయ్యారు.

## టిప్పర్ ఢీ కొని రిటైర్డ్ టీచర్ దుర్మరణం

ఎదులాపురం, ఏప్రిల్ 23: ఆదిలాబాద్‌లోని కలెక్టర్ చౌరస్తాలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ టీచర్ మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. దేవోళ్ల నారాయణ(63) అనే రిటైర్డ్ ఉపాధ్యాయుడు మార్నింగ్ వాక్ ముగించుకొని విద్యానగర్ కాలనీలోని తన ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలెక్టర్ చౌరస్తా మూలమలుపు వద్ద టిప్పర్ ఢీ కొట్టడంతో టైర్ల కింద పడి నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య

ఖానాపూర్, ఏప్రిల్ 23: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాద దాడిని పరికిపంద చర్యగా బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఖండించారు. బుధవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకుల దుష్ట చర్యలు యావత్ సమాజం ఖండించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులు అసాంఘిక కార్యకలపాలకు పాల్పడడం నీతిమాలిన చర్యగా ధ్వజమెత్తారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా నిందితులను తుదిమెట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఉగ్రదాడి క్షమించారని చర్య

భైంసా, ఏప్రిల్ 23 : జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి క్షమించారని చర్య అని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ అన్నారు. బుధవారం భైంసాలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అమాయక పౌరులపై ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడడం పిరికిపంద చర్య అని అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారి ఆత్మలకు శాంతికలగాలని కోరుకుంటూ బాధిత కుటుంబాలకు ఆ భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. అంతేగాకుండా కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై మరింత కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ తిరిగి ప్రారంభం

ఎదులాపురం, ఏప్రిల్ 23: నేరాల నియంత్రణకు పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ తిరిగి ప్రారంభిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ఎలాంటి నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏఎస్ఐ ముకుందరావ్‌కు సబ్ కంట్రోల్ రూమ్ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ .జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సీహెచ్ కరుణాకర్ రావ్, సునీల్ కుమార్, ప్రణయ్ కుమార్, ఏఎస్ఐ ముకుందరావ్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి సెలవులు.. ఇండ్లకు ప్రయాణం



సామగ్రితో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఇంటి బాట పట్టారు. ఉదయం 11 గంటల సమయంలో తల్లిదండ్రులను తమ పిల్లల బ్యాగులు ఇతర సామగ్రిని పట్టుకుని సొంత గ్రామాలకు పయానమయ్యారు. ఆదిలాబాద్ బస్టాండ్ విద్యార్థులు, తల్లిదండ్రుల రద్దీగా మారింది. పలు ప్రాంతాలకు వెళ్లే బస్సులు కిక్కిరిసిపోయాయి.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 23

## తెరుచుకోని పశువైద్యశాల



వైద్య సిబ్బంది రాకపోవడంతో తెరుచుకోని కల్లూరు పశువైద్యశాల

కుంటాల, ఏప్రిల్, 23 : నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూర్ గ్రామంలోని పశువైద్యశాలలో పని చేసే వైద్య సిబ్బంది రాకపోవడంతో పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శశిధర్ ప్రస్తుతం సెలవులో ఉండగా భైంసాలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారి విఠల్ కల్లూరు వైద్యశాలకు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన రాకపోవడంతో చికిత్స చేసే సిబ్బంది లేకపోవడంతో బుధవారం అటెండర్ వైద్యశాలను తెరవలేదు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని, ఇక్కడ తగిన వైద్యసిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## సార్వత్రిక పరీక్షా కేంద్రాల తనిఖీ

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 23: నిర్మల్‌లోని జుమ్మేరాత్ పేట పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఈద్గాం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సార్వత్రిక పరీక్షా కేంద్రాలను బుధవారం జిల్లా విద్యాధికారి రామారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులను తనిఖీ చేయాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాస్తే తగు చర్యలు తీసుకోవాలని డీవోలు, సీఎస్‌లకు సూచించారు. ఆయన వెంట విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎన్ ప్రవీణ్‌కుమార్, మహేశ్వర్, సీఎస్, డీవోలు ఉన్నారు.

## నర్సరీల పరిశీలన

దిలావర్‌పూర్, ఏప్రిల్ 23 : దిలావర్‌పూర్, కదిలి, మాడెగాం, సిర్గాపూర్, కాల్వ గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను బుధవారం ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్ పరిశీలించారు. మొక్కలు ఎండకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలని కావల్సినంత సాగు నీరు పంచాయతీ ట్యాంకర్ ద్వారా అందించాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సునీల్, శ్రావణ్ ఉన్నారు.

## మద్యానికి బానిసై ఒకరి మృతి

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 23 : మురుగు కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని కుస్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దందేగాం జిల్లా హింగోలికి చెందిన డుకారే రాహుల్ (38) కొద్ది సంవత్సరాల క్రితం బతుకు దెరువు కోసం మండలంలోని కుస్లి గ్రామానికి కూలీ పనుల నిమిత్తం వచ్చాడు. తన పని నిత్యం చేసుకునేవాడు. మద్యానికి బానిసయ్యాడు. రోజు లాగే మంగళవారం మద్యం తాగి సాయంత్రం ఇంటికి వచ్చాడు. రాత్రి 8 గంటల సమయంలో తాగడానికి భార్య ద్రుపద వద్ద రూ.1000 తీసుకొని బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆచూకీ కోసం చుట్టు పక్కల వెతికిన దొరకలేదు. బుధవారం తెల్లవారు జామున పెంటకుప్పలు పోయడానికి వెళ్లిన గ్రామస్తుడు కదం శివానంద్ మురుగు కాలువలో పడి ఉన్న అతడిని చూసి గుర్తు పట్టి మురుగు కాలువలో పడి మరణించాడని అతని భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు.

## ఎండ @ 45.2 డిగ్రీలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 23: నిర్మల్ జిల్లాలో ఎండలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. బుధవారం జిల్లాలో 45.2 డిగ్రీల అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఐదు మండలాలను వాతావరణ శాఖ అధికారులు రెడ్ జోన్‌గా ప్రకటించారు. ఆ మండలాల్లో కుభీర్ 45.2 డిగ్రీలు, దస్తురాబాద్‌లోని బట్టాపూర్, పెంబిలో, నర్సాపూర్(జీ)లో 45.1, కడెం, ఖానాపూర్‌లోని పాత ఎల్లాపూర్‌లో 45.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు.

## మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు

ఎదులాపురం, ఏప్రిల్ 23: మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఇది వర్గాలను రెచ్చగొట్టేలా పోస్టులను తయారు చేసిన, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అనుమానాలైనా సందేహాలైన జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Khanapur Branch, Dist. Nirmal** agreed to accord Loan to **Kondaji Jyothi** w/o Ramesh, Age: 35, Occ: Business, R/o H.No.6-2-43 kasba sunar galli, Nirmal, Nirmal (Dist) mortgage of the schedule referred property of **Kondaji Jyothi** (Borrower / Property holder). The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may.put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property... Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

That the Open Plot No. 12 comprised under Sy No.336/^C1/11 **admeasuring 705.00 Sq. Fts equal to 78.33 Sq. Yds or say 65.49 Sq.mtrs** situated at Maskapur (V) Khanapur (M) Nirmal District, within the limits of Gram Panchayat Maskapur, under the jurisdiction of Regn. Sub Dist Khanapur, Regn. Dist Adilabad.

**Bounded as:** East:Open Plot Others West:Road, Nortn:Open Plot Others, South:Open Plot No.12 and Open Plot No.6

**Sd/- R.JAGADISHWER RAO,** Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

## వడదెబ్బతో ఒకరి మృతి

ముథోల్, ఏప్రిల్ 23 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామానికి చెందిన గుమ్మల గంగారాం(50) వడదెబ్బతో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రోజు ఎండలో చేపల వేటకు వెళ్లి వచ్చేవాడు. మత్స్యకారుడు కావడంతో వేటాడిన చేపలను ముథోల్ ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవాడు. ఎండతో తీవ్ర అస్వస్థకు గురై ముథోల్‌లో మృతి చెందాడు. గంగారాంకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కుభీర్, ఏప్రిల్ 23 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలం వీరేగాం శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు కింద పడవేసి మంగళవారం రాత్రి అందులోని కాపర్ తీగలను దొంగిలించుకుపోయారు. బుధవారం గ్రామస్తులు కుభీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## సరస్వతీ కాల్వలో ఒకరి గల్లంతు

నిర్మల్ అర్బన్ ఏప్రిల్ 23 : సరస్వతీ కాల్వలో ఈతకు వెళ్లి నిర్మల్‌లోని షరద్ మహల్ కాలనీకి చెందిన మహ్మద్ హనీఫ్(17) గల్లంతయ్యాడు. ఇతను మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల చించోలిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేశాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణుడయ్యాడు. బుధవారం తన ఇద్దరు స్నేహితులతో కలిసి సరస్వతీ కెనాల్‌లో స్నానానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన గల్లంతయ్యాడు. తండ్రి అలీం ఆటో నడుపుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు గతంలో ఇద్దరు కుమారులు చెరువులో పడి చనిపోయారు. వీరి స్వస్థలం దిలావర్‌పూర్ కాగా కొన్ని నెలల నుంచి అక్కడి నుంచి వచ్చి నిర్మల్‌లో ఉంటున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు గల్లంతు కావడంతో ఇంట్లో విషాదచాయలు అలుముకున్నాయి.

## వడ్డీ వ్యాపారులపై కేసులు

ఎదులాపురం, ఏప్రిల్ 23: ప్రజల వద్ద అధిక వడ్డీ వసూలు చేసే వడ్డీ వ్యాపారులపై జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, మావల, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ ప్రాంతాలలో ఏక కాలంలో ఆకస్మిక దాడులు చేసి దాదాపు 20 కేసుల నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లో 30 బృందాలతో ఆకస్మిక దాడులు చేపట్టారు. ఆకస్మిక దాడులతో వడ్డీ వ్యాపారాల వద్ద గల ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్స్, చెక్కులు, స్థలాల డాక్యుమెంట్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఒకరికి బదులు మరొకరు పరీక్షకు హాజరు..

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 23 : సోమార్‌పేట బాలికల హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ లో దాసండ్ల రత్నాకర్ పరీక్ష రాయాల్సి ఉండగా అతనికి బదులు కందుల జయవర్ధన్ హాజరయ్యాడు. ఇన్విజిలేటర్ అతని హాల్‌టికెట్ తనిఖీ చేయగా అతను పట్టుబడ్డాడు. వెంటనే వారు పట్టణ పోలీస్ వారికి సమాచారం అందించగా పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. దాసండ్ల రత్నాకర్, అతనికి బదులు పరీక్ష రాసిన కందుల జయవర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా తెలిపారు. అతని ఎగ్జామ్ పేపర్, హాల్‌టికెట్ సీజ్ చేసినట్లు తెలిపారు.

# వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

నర్సాపూర్(జీ), ఏప్రిల్ 23 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)కి చెందిన తోకల సాయన్న (భోజన్న) (55) 35 సంవత్సరాల నుంచి టెంపరరీ అటెండర్‌గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల నర్సాపూర్ యందు పని చేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. రెండు నెలల క్రితం ఉద్యోగం మానేశాడు. అప్పటి నుంచి ప్రతిరోజూ మద్యం తాగి సోమవారం రాత్రి సమయంలో మద్యం అతిగా తాగి తన ఇంటి వెనుకాల అనుకొని ఉన్న రేకుల షెడ్డులో పడుకుంటానని చెప్పి వెళ్లాడు. తర్వాత కొద్ది సేపటికి కూతురు వాష్ రూమ్ కోసమని వెనుక వైపు వెళ్లగా సాయన్న ఊరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. సాయన్న కొడుకు తోకల వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు.

### భార్య తరపున బంధువుల వేధింపులతో భర్త..

లక్ష్మణచాంద, ఏప్రిల్ 23: భార్య తరపున బంధువులు వేధించడంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మాలిక్ రహమాన్ వివరాల ప్రకారం...సోన్ మండలం ముక్తాపూర్ గ్రామానికి చెందిన పులి పెద్దన్న (32)కు ఐదు సంవత్సరాల క్రితం శాంతినగర్‌కు చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. కొద్ది రోజుల నుంచి భార్యభర్తల మధ్య తరుచుగా గొడువలు జరుగుతున్నాయి. ఈ నెల 21వ తేదీన భార్యను తీసుకుని వస్తానని వెల్లడంతో అక్కడ భార్య తరపున బంధువులు ఆయనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎక్కడికైనా వెళ్లి చనిపో లేదా మేమే చంపేస్తామిని ప్రేరేపించడంతో సరస్వతి కాలువలోదూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి పులి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.